విశాలాంధ్ర
శ్రీకాకుళం
పేజి నెం. 9
సోమవారం 10, జూన్ 2024



జ్యోతిబాపూలె పాఠశాలలో మిగిలి సీట్ల భర్తీకి దరఖాస్తులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మహాత్మా జ్యోతి బా పూలె బాల బాలికల పాఠశాల లో 2024-25 విద్య సంవత్సరం కి గాను 6, 7, 8, 9 తరగతులకు సంబంధించి మిగిలి వున్న సీట్లలో భక్తికి గాను దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలల ప్రిన్సిపాల్ తెలిపారు. ధరఖాస్తులు ఆన్‌లైన్ లో ఈ నెల 15 వ తేదీ వరకు చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరఖాస్తుదారులకు జూన్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు. జ్యోతిబా పూలే వెబ్సైటు లో దరకా స్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96188 80991 నంబర్ను సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విచారణ జరపాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి డిమాండ్

విశాలాంధ్ర-పలాస : దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి డిమాండ్ చేశారు. ఆదివారం కాశీబుగ్గ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిహెచ్ రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు 720 మార్కులకు 720 రావడం ఆరుగురు ఒకే పరీక్షా కేంద్రంకు సంబంధించిన విద్యార్థులు కావడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరం అవుతున్నారని అన్నారు ఈ విద్యా సంవత్సరం ఎన్టీఏ విడుదల చేసిన పరీక్ష ఫలితాలపై పేపర్ లీకేజ్ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, జస్వంత్ ధను పాల్గొన్నారు.

కాబోయే ముఖ్యమంత్రిని కలసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎన్ఈఆర్‌కు చంద్రబాబు అభినందనలు

విశాలాంధ్ర-రణస్థలం : ఆదివారం మధ్యాహ్నం డిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ కాబోయ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఎన్ఈఆర్‌ని ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రతీ విషయం గమనించాను. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో మీరు చూపించిన పోరాట పటిమ, పట్టుదల, పోల్ మేనేజ్మెంట్‌ను ప్రస్తావిస్తూ శభాష్ అంటూ ఎన్ఈఆర్ భుజం తట్టి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, విశాఖపట్నం ఎంపీ భరత్, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రివర్గంలో చోటుదక్కేది ఎవరికి..?

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12 ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర క్యాబినెట్‌లో జిల్లాలో ఎవరికి స్థానం లభిస్తుందోనని జిల్లాలో చర్చ కొనసాగుతోంది. గతంలో రాష్ట్ర మంత్రి వర్గంలో పనిచేసిన కింజరాపు అచ్చెన్నాయుడుకు మంత్రి వర్గంలో మొదటి ప్రాధాన్యత ఉంటుందన్న చర్చ కొనసాగుతున్నప్పటికీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రిగా అవకాశం రావడంతో అచ్చెన్నాయుడుకి రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు ఉంటుందా అనే ప్రశ్న జిల్లా వాసుల్లో వినబడుతుంది. అయితే రాష్ట్ర అధ్యక్షులుగా గత ఐదేళ్ల సేవలందించి టీడీపీ అధికారంలోకి రావడంలో కీలక భాగస్వామ్యమైన అచ్చెన్నాయుడుకు ఆర్థిక శాఖ కేటాయిస్తున్నట్లు జిల్లాలో వినబడుతుంది. గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో అచ్చెన్నాయుడును ఈఎస్ఐ కేసులో ఇరికించి జైల్లో పెట్టడం పార్టీ కోసం ఆయన చేసిన సేవలో ఆయనకు కీలకపదవి లబించే అవకాశం ఉందని జిల్లా వాసులు చర్చించుకుంటున్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవికుమార్ ఈ ఎన్నికల్లో స్పీకర్ తమ్మినేని సీతారాంపై గెలుపొందడం వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలీసు నిర్బంధాలు ఎదుర్కొనడం, పలు ఇబ్బందులు పడ్డారని ఈ కోణంలో కూన రవికుమార్‌కు రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రి పదవి ఖాయమంటూ జిల్లా వాసులు అంటున్నారు. ఇచ్చాపురంలో వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించిన బెందాళం అశోక్‌కు కూడా రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం మెండుగానే ఉందని జిల్లా వాసులు చర్చించుకుంటున్నారు. కుల సమీకరణాలు నేపథ్యంలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

నేను అనే అహంకారం వీడితేనే ముక్తి

విశాలాంధ్ర-పోలాకి: మానవ జీవితంలో నేను అనే పదం వాడడం అహంకారం భావం తోనే జీవిత మోక్షం పొందలేకపోతున్నామని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పాలకొండ ప్రాంతీయులు ఎన్.వి రమణ అన్నారు. ఆదివారం చింతాడ పేట శ్రీస్వామి రామయోగి సేవాశ్రమం లో జరిగిన సత్సంగం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనిషి ఇతిహాస కథలతో మోక్షం పొందగలరని అందుకు సాధన అవసరమని అన్నారు. మనిషిలో ఉన్న అహంకారం నశించినప్పుడే అందలం ఎక్కగలమని అన్నారు. ఐక్యమత్యంతో చేసే సేవా కార్యక్రమాలతో అభివృద్ధి చెందుతూ మోక్షం పొందగలమని అన్నారు. టెక్కలి ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక ప్రియులు సింహాచలం మాట్లాడుతూ మానవజన్మ ముక్తి కొరకు భక్తితోనే సాధ్యమవుతుందని అన్నారు. సేవా ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం జరిగిన సత్సంగం ద్వారా మనిషి ఎంతో పురోభివృద్ధి చెందినట్లు సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమం నకు సహకరిస్తున్న భక్తులకు అయిన కృతజ్ఞతలు తెలిపారు. గీత విద్య ప్రచారుకులు కనుగులవలస ప్రాంతానికి చెందిన బొడ్డేవల్లి అప్పలనాయుడు, స్వామి రామయోగి, సేవాశ్రమం గౌరవ అధ్యక్షులు కరుకోల అనంతరావు స్వామీ సింగపురం లక్ష్మణరావు స్వామి మాట్లాడారు. భజన బృందం గురువు భీమారావుతో పాటు తన మిత్ర బృందం పద్యాలు కీర్తనలతో కార్యక్రమం ప్రారంభించారు. జరిగిన కార్యక్రమానికి కూన చంద్రావతి నారాయణరావు తన కుమార్తె అల్లుడు కరుకోల ఝాన్సీ, హరికృష్ణ దంపతుల ద్వారా నారాయణ సేవ కార్యక్రమం జరిగింది.

ఆర్.బి.కెల ద్వారా కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-మందస : రైతులు పండిస్తున్న పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని పలాస నియోజకవర్గం సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు అన్నారు. ఆదివారం మండలం హరిపురం మార్పు గ్రంధాలయం లో నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే ప్రతిపంట ను ప్రభుత్వమే ఆర్.బి. కె. ల ద్వారా కొనుగోలు చేయ్యాలని, జీడీ పిక్కలు పంట ఈ ఏడాది పూర్తిగా పంట పోయిందని పండిన పంటకు 80కేజీ ల బస్తా రూ.16000 ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.పంటల భీమా జీడి పంటలకు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డి మాస్టారు, దాసరి శ్రీరాములు, పుచ్చ దుర్యోధన, బెస్త. కామేశ్వరరావు, ముకుందరావు, సోమనాదం, మోహనరావు, సింహాద్రి, ధర్మారావు, వీరాస్వామి, పులారి దురోధన,పొందర దుదిష్టి కొర్ల హేమారావు చౌదరిలు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన బాతుపురం విద్యార్థి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : 2024 ఏడాది నీట్ పరీక్షా ఫలితాల్లో వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన బత్తిని అవినాష్ ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 17262వ ర్యాంక్, ఆలిండియా ఓబిసి కేటగిరిలో 4229వ ర్యాంక్ సాధించారు. ఈ ర్యాంక్ సాధించడం పట్ల అవినాష్ తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆలయ పూజారి మృతి

విశాలాంధ్ర - కాశీబుగ్గ/సోంపేట : మండలం కంబిరిగాం జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోంపేట మండలం రామయ్య పట్నం గ్రామానికి చెందిన లోకేష్ కుమార్ పాణిగ్రాహి(40) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు కుటుంబ సభ్యులు, కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు టెక్కలి నుంచి సోంపేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పలాస మండలం కంబిరిగాం జంక్షన్ వద్ద వంతెన రక్షణ గోడకు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు రామయ్యపట్నం గ్రామంలో ఆలయ పూజారిగా వ్యవహరిస్తున్నారు. మృతుడుకు భార్య ప్రత్యూష పాణిగ్రాహి ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పారినాయుడు తెలిపారు.

ఘనంగా చింతామణి అమ్మవారికి సంబరం

విశాలాంధ్ర-కవిటి: ఉద్దాన ప్రాంత వాసులు ఆరాధ్య దైవం శ్రీ చింతామణి అమ్మవారి సంబరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, కళ్యాణి విద్యాసంస్థల చైర్మన్ లోల్ల రాజేష్ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ప్రతిరూపమైన గజ ముద్దతో గ్రామంలో ఊరేగింపు చేపట్టి అమ్మవారి గుడికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కవిటి గ్రామస్తులతోపాటు చుట్టుపక్క గ్రామస్తులు పాల్గొన్నారు.

పూరీలో సోంపేట చిన్నారుల నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటకు చెందిన శ్రీనటరాజ నాట్య అకాడమీ నృత్య కళాకారులు ఒడిశా పూరిలో శనివారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొని అద్భుతమైన ప్రదర్శన ప్రదర్శించారు. కూచిపూడి నృత్యాలతో ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమానికి శ్రీనటరాజ సెంట్రల్ సంగీత నాటక అవార్డు గ్రహీత విజయ్‌కుమార్‌సాహు చేతుల మీదుగా చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు.

పూర్వ విద్యార్థుల కలయికతో స్నేహం వెల్లివిరుస్తుంది

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కలసి చదువుకుని మూడు దశాబ్దాలు దాటినా నాటి గురువులను. స్నేహితులను గుర్తుంచుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు స్వాతి శంకర్ అన్నారు. సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1991-1992 బ్యాచ్ కి చెందిన పదవ తరగతి విద్యార్థులంతా 32 ఏళ్ళకు తిరిగి అదే పాఠశాలలో కలుసుకోవడం అపూర్వమైన విషయ మన్నారు. చదువుకునే రోజులను నెమరు వెసుకుంటూ, కుటుంబ సభ్యులతో కలసి పాల్గొనడం మరపురాని అనుభూతిని మిగులుస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు స్వాతి శంకర్ చేతులమీదుగా సత్కరించారు.

లౌకిక విద్యతో పాటు నైతిక విలువల విద్య అవసరం

కన్వీనర్ సత్యసాయి సేవా సంస్థలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆధునిక యుగంలో లౌకిక విద్యతో పాటు నైతిక విలువలు తో కూడిన విద్య కూడ అవసరం ఎంతైనా ఉంది అని సత్య సాయి సేవా సంస్థల జోన ల్ కన్వీనర్ (ఆమదాలవలస) ఎం. జనార్దన రావు అన్నారు. పిల్లలు ప్రదానం గా ఆహారం, కరెంట్, డబ్బు, నీరు, శక్తినీ వృధా కాకుండా చూడాలి అని అన్నారు. ఆదివారం ఆమదాల వలస లక్ష్మీ నగర్ భజన మండలి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో రాష్ట్ర విద్యా జ్యోతి ఇంఛార్జి ఎస్.వి.గురుప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన వేసవి కాలంలో 40 రో జుల పాటు నిర్వ హించిన కంప్యూటర్ శిక్షణ లో పాల్గొన్న విద్యార్థులు 42 మందికి సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో మాట్లాడారు. జిల్లా గ్రామ సేవ ఇంఛార్జి ఎం. రవీంద్ర బాబు, మెట్టక్కివలస సమితి & లక్ష్మీ నగర్ భజన మండలి కన్వీనర్ చిన్నబాబు, ఎస్. వాసుదేవరావు కూడా పాల్గొన్నారు. రోజురోజుకి విద్యా విధానంలో సాంకేతిక మార్పులు వస్తున్న తరుణంలో నైతికతతో కూడిన విద్య యువతకు చాలా అవసరం అని తెలిపారు. ఈ కార్య క్రమంలో 40 రోజుల పాటు శిక్షకులుగా పాల్గొన్న బి.దామోదర్ పట్నాయక్ (తంబి) సేవలకు పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో బండి ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

దమయంతి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర-పలాస : పలాస సూదికొండ కాలనీలో న్యూడెమోక్రసీ కార్యాలయం వద్ద సిపిఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆ పార్టీ సీనియర్ సభ్యులు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యవర్గ సభ్యురాలు తమ్మినేని దమయంతి సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాదవరావు మట్లాడుతూ దమయంతి సేవలు చిరస్మరణీయమని, విప్లవకారుల రహస్యంగా ఆదుకోవడంలో ఆమె ముందు వరుసలో ఉండేదన్నారు. దివంగత నేత పైల చంద్రమ్మతో పాటు ఉద్యమంలో విరివిగా పాల్గొన్నారని గుర్తు చేశారు. కరజాడ ఎంపిటిసి సభ్యురాలుగా ఒకసారి ఎన్నికైందని, ఆమె ఆశయాలు కొనసాగించడం అంటే పీడిత తాడిత ప్రజల సమస్యల పట్ల ఉద్యమించడమే ఆమెకు ఇచ్చిన నిజమైన నివాలని అన్నారు. భారత కార్మిక సంఘాల సమైఖ్య జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వంకల పాపయ్య జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరుణోదయ రామారావు, కోదండరావ్, పివోడబ్ల్యు జిల్లా కార్యదర్శి బతకల ఈశ్వరమ్మ, రాపాక చంద్రయ్య, మురిపింటి తాతారావు, మామిడి భీమారావు, మద్దిల వినోద్, బంగ్లాకుమార్, సోమేష్‌లు పాల్గొన్నారు.

సిక్కోలు గర్విస్తుంది

- రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రి పదవితో జిల్లాలో హర్షాతిరేకాలు
- జిల్లా ప్రజల ఆధరాభిమానాలు మరువలేను... రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : కేంద్ర క్యాబినెట్‌లో మంత్రిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన కింజరాపు రామ్మోహన్ నాయుడును చూసి సిక్కోలు గర్విస్తుందని జిల్లా వాసులు అంటున్నారు. దివంగతనేత కింజరాపు ఎర్రన్నాయుడు మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చిన రామ్మోహన్ నాయుడు వరుసగా మూడు సార్లు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి హ్యాట్రిక్ విజయం సాధించడం ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా స్థానం సంపాదించడంతో జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సౌమ్యుడుగా మంచి వాగ్ధాటి కలిగిన నేతగా రాజకీయాలకు అతీతంగా రామ్మోహన్ నాయుడుకు జిల్లాలో అభిమానులు ఎక్కువ. రామ్మోహన్ నాయుడుకు మంత్రి పదవి రావడంతో తమకే వచ్చిందన్న ఆనందంతో జిల్లా వాసులు మురిసిపోతున్నారు. రాష్ట్ర సమస్యలు, ఉత్తరాంధ్ర సమస్యలు ముఖ్యంగా జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించిన సంధర్భాన్ని గుర్తు చేసుకుంటూ మంత్రి పదవితో జిల్లా అభివృద్ధితో పాటు జిల్లా కీర్తిని దేశమంతా చాటే సమర్థుడని పలువురు కొనియాడుతున్నారు. చిన్నా పెద్దా అంటూ తేడాలేకుండా పార్టీలకు అతీతంగా రామ్మోహన్ నాయుడు పదవిపై జిల్లా వాసులు ఆనందంతో ఉప్పొంగుతున్నారు.

- జిల్లా ప్రజల ఆధరాభిమానాలు మరువలేను : రామ్మోహన్ నాయుడు

తన తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చిన తనను తమ అక్కున చేర్చుకొని వరుసగా మూడు సార్లు పట్టం కట్టారని, ఆ ఫలితమే నేడు ఈ కేంద్ర మంత్రి పదవికి కారణమని, జిల్లా ప్రజల ఆధరాభిమానాలు మరువలేనని కింజరాపు రామ్మోహన్ నాయుడు విడుదల చేసి వీడియో సందేశంలో తెలిపారు. నా విజయంలో కీలక పాత్ర పోషించిన జిల్లా ప్రజలు, నా అభిమానులు, మా కుటుంబ సభ్యులతోపాటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాకు లభించిన ఈ పదవిని రాష్ట్ర భవిష్యత్ కోసం, దేశ అభివృద్ధి కోసం పనిచేస్తానని, మీ అందరి అధరాభిమానాలు ఇదే విధంగా కొనసాగాలని కోరుతున్నట్లు తెలిపారు.

మెళియాపుట్టి: శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర క్యాబినెట్ మంత్రిగా స్థానం సంపాదించడం పట్ల స్థానిక మెళియాపుట్టి మండల కేంద్రంలో తెలుగుదేశం కూటమి సభ్యులు కేక్ కట్ చేసి ఆనంద హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో మూడోసారి ఎంపీగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించడంతోపాటు అఖండమైన మెజారిటీతో సిక్కోలు ఎంపీగా గెలుపొందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం ప్రధాని మంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర కాబినెట్ లో చోటు దక్కించుకోవడం పై మెళియాపుట్టి మండలానికి చెందిన కూటమి నేతలు పలువురు సంతోషాన్ని వ్యక్తం చేస్తు మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం బాణాసంచా కాల్చి కేకును కత్తిరించి అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అతిపిన్న వయసులో కేంద్ర కాబినెట్లో చోటు దక్కించుకోవడం ఒక రామ్మోహన్ నాయుడుకే సాధ్యమని, తండ్రి బాటలో తనయుడు చిక్కోలు ఖ్యాతిని దేశస్థాయిలో మరింతగా పెంపొందించేందుకు కృషి చేస్తారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మాడుగుల రమణయ్య, సర్పంచ్ ప్రతినిధులు వాసు, మాలతి శ్రీధర్, రవ్వల గణపతిరావులతో పాటు ఏరుసు శ్రీనివాసరావు, మాడుగుల బానుజీరావు, ఏచ్చిన రాజమోహన రావు, దున్న శ్రీనివాసరావు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, కూటమి సభ్యులు, తదితరులు ఉన్నారు.

అక్రమాలపై చర్యలు షురూ...

- ఎంజెపి ఉద్యోగుల సేవలు నిలిపివేత,,
- ఎన్నికల్లో కార్యకర్తల్లా పనిచేసిన ఉదంతాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: గత ప్రభుత్వంలో అవుట్సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించిన కొంతమంది అధికార పార్టీకి కొమ్ము కాస్తూ కార్యకర్తల వలె పని చేసిన వారు ఇటీవల జరిగిన పరిణామా లతో కొత్త ప్రభుత్వం అటువంటి వారిపై దృష్టి సారించింది. దీంతో వారు కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కూన రవికుమార్ ను మర్యాదపూర్వ కంగా కలిసేందుకు వెళ్లి వచ్చారు. ఆ ప్రదేశంలో ఉన్న ఆ అధికారులతో బాధించబడ్డ కొంతమంది కార్యకర్తలు వారి అవినీతి అక్రమాలపై అధినేతకు వివరించారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ కార్యకర్తలన సముదాయించేందుకు యత్నించిన ఫలితం దక్కలేదు. మొత్తం మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాల, కళాశాలలో ఎంతమంది పనిచేస్తున్నారని ఆరా తీశారు. ప్రిన్సి పల్ జూనియర్ అసిస్టెంట్ రెగ్యులర్ పోస్టులు కాగా మిగిలిన 30 మంది ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి నియామకంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, కొన్ని పోస్టులను నేరుగా ప్రిన్సిపాల్ అమ్మకానికి చూపించారని, వివిధ ఆరోపణలతో అప్పట్లో విశాలాంధ్ర తోపాటు పలు పత్రికలు ప్రచారం చేశాయి. అప్పటి అధికారి పార్టీ నాయకులు కొందరు వారికి కొమ్ము కాస్తూ వారి వద్ద నుండి భారీ వసూళ్ల కు పాల్పడ్డారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వారిని సెలవుపై వెళ్లాలని విద్యాశాఖ ఉన్న తాధికారులు ప్రిన్సిపాల్ కు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో చేయగలిగింది లేక మా ప్రిన్సిపాల్ అక్కడ నుంచి వెనుదిరిగినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇక్కడ పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఏజెంట్లుగా పనిచేసినట్లు స్పష్టమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా జరిగిన తోపులాట్లు తల పగులుగొట్టి పోలీస్ కేసులో ఉన్న వారు కొందరైతే, ఏజెంట్గా వ్యవహరించి టిడిపి సానుభూతి ఓట్లను అడ్డుకునేందుకు కొర్లకోట గ్రామంలో యత్నించిన వారు కొందరు. అలాగే మరి కొంతమంది విద్యార్హతలు లేన ప్పటికీ వారిని అక్రమ పద్ధతులునియ మించుకున్నారని ఆరోపణల నేప థ్యంలో అటువంటి వారు కూడా సెలవుపై వెళ్లాలని మౌఖిక ఆదేశాలు ఉన్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో చదువుకొని అక్కడి భాష వచ్చునని సర్టిఫికెట్ లేకున్నప్పటికీ పండిట్గా నియమించారని, ఇక్కడ పోస్టింగ్ ఇచ్చిన తర్వాత ఒక ప్రైవేటు కళా శాలలో డిగ్రీ పరీక్షలు రాసిన వారికి కూడా ఇక్కడ ఉపాధ్యాయులుగా నియమించడం పై పలు అనుమానాలు ఉండటంతో వారు కూడా సెలవు పైనే వెళ్తారని తెలిసింది. అర్హతలు లేని వారిని ఎటువంటి విధి విధానాలు పాటించకుండా నియా మకాలు జరిపి అక్రమంగా వసూళ్లకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం షురూ చేసిందని చెప్పవచ్చు.

జేఈఈ మెయిన్స్‌లో కోరాడ సాదీప్‌కు 1450 ర్యాంక్

విశాలాంధ్ర-నరసన్నపేట : నరసన్నపేటకు చెందిన కోరాడ సాదీప్ జెఈఈ అడ్వాన్స్‌లో 225 మార్కులతో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీ 1265 ర్యాంక్‌ను స్వంతం చేసుకున్నారు. జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరీ 1450 ర్యాంక్ సాధించారు. సాదీప్ గుంటూరు భాష్యం లో 10 వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. తండ్రి కోరాడ వైకుంత రావు మ్యాథ్స్ ఉపాధ్యాయులు %ళాను% కంబకాయ నరసన్నపేట మండలంలో పనిచేస్తున్నారు. యుటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు గా ఉపాధ్యాయులకు సేవలందిస్తున్నారు. తల్లి దుర్గాభవాని ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని జెడ్‌పిహెచ్ఎస్ అచ్చుతాపురం జలుమూరు మండలంలో పనిచేస్తున్నారు. అన్నయ్య నిట్ రూర్కెలాలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదువుచున్నారు. శాదీప్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేయాలని కోరిక. సాదీప్ విజయం పట్ల యూటీఎఫ్ జిల్లా సహధ్యక్షులు, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి & యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్‌లు అభినందనలు తెలిపారు.

రామోజీరావుకి మిరాజ్ చిత్ర యూనిట్ నివాళి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మన ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన రామోజీ రావు కు మిరాజ్ చిత్ర యూనిట్ ఘన నివాళులు అర్పించింది. ఆదివారం అక్కుపల్లి శివ సాగర్ తీరంలోని శివాలయం ఆవరణలో చిత్రబృందం రామోజీ చిత్రపటం వద్ద మూడు నిమిషాలు మౌనం పాటించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ నాయక్ మాట్లాడుతూ రామోజీ ఫిలిం సిటీ స్థాపించి ఈటీవీ 13 భాషల్లో ప్రసారం చేస్తూ సినిమా ప్రపంచానికి అనేక మంది కళాకారులను పరిచయం చేస్తూ, 25 వేల మందికి ప్రత్యక్షంగా ,89 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిన ఘనత రామోజీరావుకె దక్కిందని అన్నారు. మిరాజ్ చిత్ర యూనిట్ దర్శకుడు రచయిత విష్ణుదేవ్ మాట్లాడుతూ 1936 నవంబర్ 16న పెదపారుపూడి గుడివాడ సమీపమున జన్మించిన రామోజీరావు కారణజన్ముడని అన్నారు. చిత్ర నిర్మాణము ఈరోజు వాయిదా వేస్తున్నామని విష్ణుదేవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఓ పి ఎం. డి. బి .ఖలీల్, అసిస్టెంట్ డైరెక్టర్ శరత్, నటులు డాక్టర్ కుమార్ నాయక్, రమేష్ యాదవ్ , యన్ ప్రసాద్,హీరో చరణ్, తామాడ కీర్తన, ఆర్ శృతి ,ఎమ్ స్వాతి ,ఎం మహాలక్ష్మి, ఆశిష్ చోటు, ప్రొడక్షన్ రాజేష్, సిహెచ్ దామోదర తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాలి... ఈ మండలం మేఘవరం లో కల హుదుద్ తుఫాన్ కాలనీ వద్ద ఆదివారం ఈనాడు సంస్థల అధినేత చిలుకూరు రామోజీరావుకు సంతాపసభ నిర్వహించారు. రామోజీరావు ఈనాడు సంస్థ ఆధ్వర్యంలో తుపానులో ఇళ్ల కూలిపోయిన పేదలకు పక్కాఇల్లు కట్టించి ఇచ్చారని, అటువంటి వ్యక్తిని మేము మర్చిపోలేమని మాజీ సర్పంచ్ పరపటి కళావతి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రామోజీరావు కు రుణపడి ఉంటామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రామోజీల చిత్రపటానికి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్య నాయకులు సూరాడ రాయుడు, కుర్మారావు, జిన్నారెడ్డి, పూలమాలలు వేసి నివాళులర్పించారు రామోజీరావు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.